క్లుప్తంగా

వైఎస్సార్ రైతు భరోసాతో రైతుల్లో ఆనందం

బల్లికురవ/మేదరమెట్ల: వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ భరోసాలో భాగంగా బల్లి కురవ మండలంలోని 20 ఆర్బీకేల పరిధిలోని మండలంలోని 10,730 మంది రైతులకు లబ్ధి చేకూరినట్లు వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి మంగళవారం తెలిపారు. ప్రభుత్వం నగదును రైతుల ఖాతాలకు ఒక్కో రైతుకు రూ.4 వేల వంతున జమ చేసిందని తెలిపారు. మూడో విడత జనవరి, ఫిబ్రవరి నెలల్లో జమ అవుతాయని చెప్పారు. ఒక్కో రైతుకు రూ.13,500 లను మూడు దఫాలుగా గత నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం జమ చేస్తున్నట్లు ఆమె వివరించారు. కొరిశపాడు మండలంలోని 6543 మంది రైతులకు లబ్ధి చేకూరినట్లు ఏవో శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా అంబేడ్కర్ పాఠశాలలో చేరిన రోజు

ఇంకొల్లు (చినగంజాం): అంబేడ్కర్ పాఠశాలలో చేరిన రోజును మంగళవారం ఇంకొల్లులో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిల్లాల డేవిడ్ ఇంకొల్లులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1900 నవంబరు 7వ తేదీన ఆయన పాఠశాలలో చేరిన రోజు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనార్టీ, పేద ప్రజలు, అణగారిన వర్గాల కష్టాలు కడతేరడానికి బీజం పడిన రోజన్నారు.

అశ్రునయనాలతో అంత్యక్రియలు పూర్తి

చీరాల అర్బన్: విజయవాడలోని బస్‌స్టేషన్‌లో సోమవారం జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన చీరాల ఉజిలిపేటకు చెందిన మోటాని కుమారి అంత్యక్రియలు మంగళవారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. విజయవాడ నుంచి చీరాల వచ్చేందుకు మోటాని కుమారి బస్‌స్టేషన్‌లో వేచి ఉండగా ఒక్కసారిగా బస్సు దూసుకురావడంతో ఆమెతో పాటు ఆరు నెలల మనుమడు ప్రమాదంలో మృతిచెందారు. పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని సోమవారం రాత్రి చీరాలకు తీసుకురాగా మంగళవారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు.

అనుమతులు తప్పనిసరి

బల్లికురవ: దీపావళి మందుల అమ్మకాలకు అనుమతులు తప్పనిసరని ఎస్సై వీ వేమన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులతోపాటు గ్రామానికి దూరంగానే మందుల విక్రయాలు చేపట్టాలని, అనుమతులు లేకుండా గ్రామాల్లో మందుల విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన తైక్వాండో శిక్షణ



సర్టిఫికెట్ అందిస్తున్న ప్రిన్సిపాల్

అద్దంకి: మహిళా సాధికారత సమితి ఆధ్వర్యంలో స్థానిక కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తైక్వాండో శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వీ మోహనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారన్నారు. ఒలంపిక్స్‌లో పతకాలు సాధించిన ఘనత మహిళలకే దక్కుతుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాక్ కో ఆర్డినేటర్ దాసు, కళాశాల సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

31 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

బేస్తవారిపేట: మండలంలోని బసినేపల్లెలో ఓ గృహంలో అక్రమంగా నిల్వ ఉంచిన 31 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అనిల్‌కుమార్ మంగళవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. రేషన్ బియ్యం నిల్వ చేసిన గృహాన్ని సీజ్ చేసి 6–ఏ కేసు నమోదు చేశారు. బేస్తవారిపేట పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ జితేంద్రకుమార్, వీఆర్వో ఖాశింసా పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు శివలక్ష్మి

పెద్దారవీడు: మండలంలోని ఏనుగులదిన్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న జిల్లెల శివలక్ష్మి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీలో పాల్గొని జాతీయ స్థాయిలో ఆడేందుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు మంగళవారం తెలిపారు. సోమవారం ఒంగోలు పీవీఆర్ స్కూల్లో రాష్ట్ర స్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించగా మూడో స్థానంలో విజయం సాధించిందని, త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటుందని పేర్కొన్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ జాతీయ స్థాయిలో విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. శివలక్ష్మిని శాలువా, పూలమాలతో సర్పంచ్ బలుసుపాటి లూథియా, జెడ్పీహెచ్ స్కూల్ చైర్మన్ ఏర్వ పెద్దశివారెడ్డి, పీడీ దేవండ్ల చంద్ర, పీఈటీ సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

- బీఎల్వోల పాత్ర కీలకం
- చీరాల ఆర్డీవో సరోజిని



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సరోజిని

చీరాల టౌన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు నమోదు కల్పించాల్సిన బాధ్యత ఉద్యోగులు అందరిపై ఉంటుందని చీరాల ఆర్డీవో సరోజిని పేర్కొన్నారు. మంగళవారం చీరాల తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. అదనపు ఎన్నికల అధికారి, చీరాల తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆర్డీవో హాజరై మాట్లాడారు. చీరాల నియోజకవర్గం (106)లో ఓటరు రివిజన్‌లో భాగంగా ఓటు నమోదు, మార్పులు, మృతిచెందిన వారి ఓట్లు తొలగింపు, ఓటరు సర్వే బూత్ లెవల్ అధికారులతో నిష్పక్షపాతంగానే చేస్తున్నామన్నారు. ఎవరి ఓట్లు తొలగించడం లేదని, అనర్హులకు ఓటు హక్కు కల్పించడం లేదని స్పష్టంగా తెలియజేశారు. నియోజకవర్గంలోని చీరాల రూరల్ మండలం, చీరాల మున్సిపాలిటీ, వేటపాలెం మండలాల్లో ఓటరు రివిజన్ సమర్థవంతంగా చేస్తున్నామని పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ–రోల్‌లో వచ్చిన అర్జీల విచారణను త్వరగా చేయాలన్నారు. నియోజకవర్గంలో ఫారం–7కి సంబంధించి 1883 అర్జీలు, 8 ఫారం 5045 అర్జీలు అందాయన్నారు. వీటన్నింటిని విచారించి అర్హులైన వారికే ఓటు హక్కుతో పాటుగా యాచకులు, అనాథాశ్రమాల్లో ఉండే వారికి ఓటు హక్కు ఎక్కడ ఉంటే వారికి అనుకూలమైన ప్రాంతంలో హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేక ఓటరు నమోదుకు, ఓటరు అర్జీల విచారణలకు అన్నీ రాజకీయ పార్టీలు సహకారం అందించాలని ఆర్డీవో సూచించారు. సమావేశంలో చీరాల, వేటపాలెం తహశీల్దార్లు ప్రభాకరరావు, అశోక్‌వర్ధన్, డీటీలు సురేష్, ఆదినారాయణ, బీజేపీ, టీడీపీ, సీపీఎం, జనసేన, బీఎస్పీ పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

చీరాల టౌన్: అన్నీ గ్రామ పంచాయతీల్లోని సచివాలయాల పరిధిలో ఈనెల 9 నుంచి 23 వరకు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కె.నేతాజీ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయడంతో పాటుగా ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలన్నారు. ప్రతి వలంటీర్ తమకు కేటాయించిన 50 ఇళ్లకు చెందిన ప్రజలకు ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్‌లు అందించడంతో పాటుగా ఈ–కేవైసీ చేయించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి ఉద్దేశాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో విజయవంతం చేయాలని ఎంపీడీవో సూచించారు. ఈనెల 23 వరకు జరగనున్న కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేశారు. సమావేశంలో ఈవోఆర్డీ మురళీబాపూజీ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

మేదరమెట్ల మండలంలో..

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని 15 గ్రామ పంచాయతీలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన జాబితాను సచివాలయాల వద్ద ప్రదర్శిస్తారని ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన పది గ్రామ పంచాయతీల వద్ద నిర్ణయించిన తేదీల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల మధ్య సమయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు. ఈనెల 9,10 తేదీల్లో కొరిశపాడు, 14,15,16 తేదీల్లో మేదరమెట్ల, 17 తమ్మవరం, 20న బొడ్డువానిపాలెం, 21 దైవాలరావూరు, 22, 23 తేదీల్లో రావినూతల గ్రామ పంచాయతీల వద్ద కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం



మాట్లాడుతున్న రమాదేవి

అద్దంకి: మాయమాటలో ప్రజలను మోసం చేసిన మోదీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి అన్నారు. ప్రచార ప్రజా రక్షణ భేరి అద్దంకి చేరిన సందర్భంగా పట్టణంలోని భవానీ సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో మహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఈ నెల 15న విజయవాడలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, సీపీఎం పార్టీ లో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైదనలో వైభవంగా ధర్మప్రచారం



రథానికి స్వాగతం పలుకుతున్న గ్రామ పెద్దలు



పూజలు చేస్తున్న భక్తులు

బల్లికురవ: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం నుంచి బయలుదేరిన ధర్మప్రచార రథం మంగళవారం వైదన గ్రామంలోకి ప్రవేశించింది. ఆలయం నుంచి కొప్పరపాడు మీదుగా గ్రామానికి చేరుకున్న ప్రచార రథానికి గ్రామ సర్పంచ్ మేడా జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు నక్కా పార్వతి, వైఎస్సార్ సీపీ నాయకుడు మేడా శివదుర్గ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మేళతాళాలతో హారతులిచ్చి స్వాగతం పలికారు. గ్రామంలో ఎంతో చరిత్ర కలిగిన రామలింగేశ్వరస్వామి చెన్నకేశవస్వామి, ఆలయాల వద్దకు స్వామివారి రథాన్ని తీసుకుని వెళ్లారు. అర్చకులు పేటేటి శ్రీనివాసరావు, పర్చూరు జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి సింధూరంతో సహస్ర నామార్చన, సామూహిక ఆకు పూజలు, సాయంత్రం జలహారతి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టీ సుభద్ర, ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్, ఈవో జీవీఎల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు ప్రచార రథంలోని స్వామిని దర్శించుకున్నారు.

గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ

కారంచేడు: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ గృహ నిర్మాణాలను లబ్ధిదారులకు త్వరగా అందించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పీ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిషత్ సమావేశ హాలులో నిర్వహించిన అన్ని గ్రామాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బీబీఎల్ స్టేజ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను గ్రౌండ్ చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండలంలో 134 గృహ నిర్మాణాలు జరగాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాశీం, అన్ని గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

చిన్నారులను కంటికి రెప్పలా కాపాడాలి



సదస్సులో మాట్లాడుతున్న మహిళా న్యాయవాది వినీల

చీరాల రూరల్: చిన్నారులకు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తూ వారిని కంటికి రెప్పలా కాపాడాలని న్యాయవాదులు పేర్కొన్నారు. శిశు సంరక్షణా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పేరాల శృంగారపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ అడ్వకేట్స్ వినీల, సురేష్‌లు మాట్లాడారు. గర్భస్థ శిశులను స్కానింగుల ద్వారా గుర్తించి వారిని తల్లి కడుపులోనే చిదిమేయవద్దని సూచించారు. తమ పిల్లలను లింగ బేధం లేకుండా చూడాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాల ద్వారా మంచి విద్య, పౌష్టికాహారాన్ని అందించాలని వారు సూచించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చిన్నారులకు అనేక మంచి పథకాలు ప్రవేశపెట్టి మంచి పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. వాటిని చిన్నారులకు అందించి సద్వినియోగం చేయాలని సూచించారు. చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడితే కఠిన పోలీసులు కఠిన చర్యలు తీసుకుని పోక్సో కేసులు నమోదు చేస్తారని చెప్పారు. మహిళల కోసం అనేక చట్టాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి. కవిత, పీఎల్వీ ఎస్‌డీ. మతిన్, సీహెచ్. సిలోహ్ ఆర్క్, మహిళా పోలీసు డి. హరిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. దక్షిణాయనం, ఆశ్వీజ మాసం, మాఘ నక్షత్రం, ఏకాదశి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీసేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోష కాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

కల్తీ నూనెతో తినుబండారాలు తయారీ



దుకాణంలోని కల్తీ నూనె డబ్బాలు

పర్చూరు (చినగంజాం): ఎవరైనా లాభాపేక్ష కోసమే వ్యాపారం చేస్తుంటారు. లాభం ఎంత ముఖ్యమో ప్రజల ప్రాణాలు అంతకంటే ముఖ్యం. మండల కేంద్రమైన పర్చూరులో ప్రధాన కూడలిలో తినుబండారాల దుకాణదారులు ఈ విషయాన్ని విస్మరించి తమ వ్యాపారాలు కొనసాగించడం విస్మయానికి తావిస్తోంది. ముఖ్యంగా పర్చూరు ప్రధాన సెంటర్‌గా చెప్పుకునే బొమ్మల సెంటర్‌లో కొందరు దుకాణ దారులు కల్తీ నూనెతో స్వీట్లు, తినుబండారాలు తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఒకసారి ఉపయోగించిన కల్తీ నూనెను తక్కువ ధరకు కొనుగోలు చేసి తమ వంటకాల్లో వినియోగిస్తున్నారు. ముఖ్యంగా స్వీట్‌లు, తినుబండారాల తయారీలో కల్తీ నూనెను అధికంగా వాడుతున్నారు. వీటిని తిన్నటువంటి ప్రజలు రోగాలు బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. తినుబండారాలు తయారు చేసే దుకాణాలు అపరిశుభ్రంగా ఉండటంతో ప్రజలు కొనుగోలు చేసేందుకు భయపడుతున్నారు. స్థానిక పంచాయతీ అధికారులు వీటిని నిత్యం గమనిస్తూనే చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుకాణాలను పరిశీలించి అపరిశుభ్రంగా ఉన్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

11న హైదరాబాద్‌లో విశ్వరూప మహాసభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

బల్లికురవ: హైదారాబాద్‌లో ఈ నెల 11న నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ అద్దంకి ఇన్‌చార్జి వీ రమేశ్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం బల్లికురవలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వ్యవస్థాప అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ బాధ్యుడు కేపేతురు మాదిగ, పార్థసారథి మాదిగ ఏసన్న, వీరన్న, మాజీ ఎంపీటీసీ జంధ్రాజుపల్లి నాగయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత లేకుండా చర్యలు

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో నివాసం ఉంటున్న కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనత రాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి సూచించారు. మంగళవారం మండలంలోని ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాడరేవు, తోటవారిపాలెం, ఈపురుపాలెం, జాండ్రపేట గ్రామ పంచాయతీలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ గ్రామాల్లోని కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, ఆకుకూరలు, గుడ్లు, ఐరన్ మాత్రలు, వైఎస్సార్ పోషణ కిట్‌లను వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రక్, బైక్ ఢీ-ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులు శ్రీనివాసరావు, సాయిబాబు

మార్టూరు: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనాన్ని ట్రక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈఘటన జాతీయ రహదారి పక్కన రాజుపాలెం జంక్షన్‌లో మంగళవారం ఉదయం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. చిలకలూరిపేట మండలం కావూరి గ్రామానికి చెందిన కే శ్రీనివాసరావు, ఎల్ సాయిబాబు ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట నుంచి మార్టూరు వస్తున్నారు. ఈ క్రమంలో డేగరమూడి విశ్రాంతి స్థలంలో నుంచి వెలుపలికి భారీ ట్రక్ మలుపు తీసుకుంటూ ప్రమాదవశాత్తు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు ఇరువురిని స్థానికుల సమాచారంతో హైవే అంబులెన్స్ సిబ్బంది గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీవీ రామన్ జీవితం నేటి తరానికి స్ఫూర్తి



నందిగుంటపాలెంలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కారంచేడు: నోబెల్ అవార్డు గ్రహీత డాక్టర్ సీవీ రామన్ జీవితం నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, ములబంటి వెంకటేశ్వర్లులు అన్నారు. మంగళవారం వారు స్థానిక ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని కారంచేడు యూపీలోను, యజ్ఞశాలపేట ప్రాథమిక పాఠశాల, అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల, కుంకలమర్రు సీసీ, మొయిన్ ప్రాథమిక పాఠశాల, స్వర్ణ, రంగప్పనాయుడువారిపాలెం, నందిగుంటపాలెం, జరుబులవారిపాలెం, దగ్గుబాడు, ఆదిపూడి మొయిన్ ప్రాథమిక పాఠశాలల్లో సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఆయన జీవితాన్ని, నిరంతర కృషి, పట్టుదలను వివరించారు.

మేదరమెట్లకు చేరుకున్న సీపీఎం బస్సుయాత్ర



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

మేదరమెట్ల: సీపీఎం ఆధ్వర్యంలో అనంతపురం నుంచి విజయవాడ వరకు నిర్వహిస్తున్న ప్రజా రక్షణ భేరి రథయాత్ర మంగళవారం కొరిశపాడు మండలంలోని మేదరమెట్లకు చేరుకుంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకరరెడ్డి, డీ.రమాదేవి, వీ.కృష్ణయ్య, ఉమామహేశ్వరరావు, జిల్లా నాయకులు గంగయ్య, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో వాహనదారుల ఇక్కట్లు

చీరాల టౌన్: కొద్దిపాటిగా కురిసిన వర్షానికే ప్రధాన రోడ్లలో నీరు నిలిచింది. మంగళవారం కురిసిన వర్షానికి మండలంలోని ప్రధాన రహదారులైన ఈపురుపాలెం, దేవాంగపురి గ్రామాల్లోని రహదారులన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. మోస్తరు వర్షం కురిస్తే చీరాల–ఒంగోలు, చీరాల–గుంటూరు ప్రధాన రహదారుల్లో ప్రయాణించే వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రోడ్లపై రెండు అడుగుల మేర నిల్వ చేరడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిల్వ చేరకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయంలో హుండీ చోరీ

వేటపాలెం: దొంగలు ఆలయంలో హల్‌చల్ చేశారు. రైల్వే స్టేషన్ రోడ్డులో గల స్వయంభు గణపతి ఆలయం ప్రాంగణంలో హుండీని దొంగలు పగలగొట్టి సోమవారం చోరీకి పాల్పడ్డారు. ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్సై జి సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.